అవి ఆయుర్వేదిక్ బీడీలు

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గుంటూరు కారం'. సంక్రాంతి కానుకగా వచ్చిన ఈ చిత్రంలో ఎక్కువగా బీడీలు కాలుస్తూ కనిపించారు మహేష్‌బాబు. స్వతహాగా ఆయన ధూమపానాన్ని ప్రోత్సహించరు. అయితే 'ఒక్కడు', 'పోకిరి'లాంటి చిత్రాల్లో మాత్రం క్యారెక్టర్ డిమాండ్ మేరకు సిగరెట్లు ఊదారు. 'గుంటూరు కారం' సినిమా ఆసాంతం బీడీలు తాగుతూ కనిపించారు. ఈ సినిమా ఊర మాస్ ఎంటర్‌టైనర్. గుంటూరు రమణగా మాస్ పాత్రలో కనిపించారు మహేష్‌బాబు. మాస్ ఇంపాక్ట్ కోసం ఆయన బీడీలు కాల్చక తప్పలేదు. తాజాగా సినిమాకు సంబంధించి కొన్ని ఆసక్తికర విశేషాలను మహేష్‌బాబు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వివరించారు. ''నా గత చిత్రాలకు భిన్నంగా ఇందులో డ్యాన్స్ మూమెంట్స్ ఉండాలని ముందునుంచే నేను, డైరెక్టర్ అనుకొని రమణ పాత్రకు అనుగుణంగా పాటలను డిజైన్ చేసుకున్నాం. నేను స్మోకింగ్‌ను అస్సలు ప్రోత్సహించను. అయితే సినిమాలో నేను బీడీ కాల్చడం వెనుక ఉన్న అసలు కథ ఇప్పుడు చెబుతా. అవి ఆయుర్వేదిక్ బీడీలు. లవంగం ఆకులతో తయారుచేశారు. షూటింగ్ ప్రారంభంలో నాకు ఒరిజినల్ బీడీలే ఇచ్చారు. అవి కాల్చినప్పుడు మైగ్రేన్ వచ్చి తల తిరిగిపోయేది. ఆ నొప్పి భరిస్తూ షూటింగ్‌లో పాల్గొనడం నావల్ల కావటంలేదని త్రివిక్రమ్‌కు చెప్పా. ఆ మరుసటి రోజు నుంచి సెట్ వాళ్లు ఆయుర్వేదిక్ బీడీలు తయారు చేసి తీసుకొచ్చారు. అందులో ఎలాంటి తంబాకు ఉండదు. మింట్ ఫ్లేవర్‌లో ఉండటంతో సౌకర్యవంతంగా షూటింగ్ చేసేందుకు వీలైంది. రోజూ షూటింగ్ అయిపోయాక వాటిని జాగ్రత్తగా ప్యాక్ చేసి భద్రపరిచేవారు'' అని అసలు విషయం చెప్పుకొచ్చారు సూపర్ స్టార్. ప్రస్తుతం ఈ ఇంటర్వ్యూ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

'ఓజీ'లో పవన్ పాట

అగ్ర హీరో పవన్‌కల్యాణ్ పాటలు పాడటం కొత్తేమీ కాదు. తమ్ముడు, ఖుషి, జాని, గుడుంబా శంకర్, అత్తారింటికి దారేదీ వంటి చిత్రాల్లో ఆయన తన గాన కౌశలంతో అభిమానుల్లో జోష్‌ను నింపారు. తాజా చిత్రం 'ఓజీ' కోసం పవన్‌కల్యాణ్ మరోమారు గొంతు సవరించుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో కథానుగుణంగా పవన్‌కల్యాణ్‌తో ఓ పాట పాడించే అవకాశం ఉందని సంగీత దర్శకుడు తమన్ వెల్లడించారు. దీంతో మరోమారు పవన్‌కల్యాణ్ గళం నుంచి మాంచి హుషారైన పాట వినొచ్చని అభిమానులు సంబరపడిపోతున్నారు. 'ఓజీ' చిత్రాన్ని జపాన్-ముంబయి నేపథ్య కథాంశంతో తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. కొద్ది మాసాల క్రితం విడుదల చేసిన ఈ సినిమా గ్లింప్స్ అంచనాలను పెంచింది. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు.

ఆ వార్తల్ని నమ్మొద్దు!



విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఓ సినిమా రూపొందిస్తున్నారు. విజయ్ దేవరకొండ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న చిత్రమిది. అధిక బడ్జెట్ కారణంగా ఈ సినిమా హఠాత్తుగా ఆగిపోయిందన్న ప్రచారాన్ని చిత్ర యూనిట్ ఖండించింది. 8 నెలల క్రితం 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్టుకు పూజా కార్యక్రమాలు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమా ఆగిపోయిందన్న వదంతులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బృందం క్లారిటీ ఇచ్చింది. ఆ వార్తలు నమ్మొద్దని పేర్కొంది. విజయ్ ప్రస్తుతం 'ఫ్యామిలీ స్టార్' సినిమాతో బిజీగా ఉన్నారు. అది పూర్తయ్యాక 'వీడీ12' షూటింగ్‌ను మార్చి మొదటి వారంలో ప్రారంభించే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెరకెక్కిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. శ్రీలీల విజయ్‌తో జత కడుతున్నది. ప్రస్తుతం విజయ్ హీరోగా నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఒక భారీ షెడ్యూల్‌ను ఇటీవలే న్యూయార్క్‌లో పూర్తి చేశారు మేకర్స్. పరశురాం దర్శకత్వంలో రానున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయిక.

ఆ సన్నివేశాలు ఇబ్బందిగా అనిపిస్తాయి!

అచ్చ తెలుగు అందం అంజలి తెలుగుతో పాటు దక్షిణాది భాషల్లో దూసుకుపోతున్నది. కథాబలమున్న చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను ఎంపిక చేసుకుంటూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నది. 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో ఈ భామ త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతున్నది. ఇదిలావుండగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాల్లో ముద్దు సన్నివేశాల్లో నటించడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది అంజలి. ఇంటిమేట్ సీన్స్ తనకు అసౌకర్యంగా అనిపిస్తాయని, అయితే కథానుగుణంగా కొన్నిసార్లు అంగీకరించాల్సి వస్తుందని చెప్పింది. 'నిజజీవితంలో ప్రేమికుల మధ్య ఉండే కెమిస్ట్రీకి, ఆన్‌స్క్రీన్‌లో ప్రేమికుల మధ్య ఉండే కెమిస్ట్రీకి చాలా తేడా ఉంటుంది. అలాంటి సీన్స్ చేసేటప్పుడు నా కోస్టార్ ఏమనుకుంటాడో, ఎలా స్వీకరిస్తాడోననే టెన్షన్ ఉంటుంది. ఒక్కోసారి కథలో భాగంగా రొమాన్స్ పండించడానికి అలాంటి సీన్స్‌లో నటించడం తప్పనిసరి అవుతుంది. అప్పుడు ఇష్టం లేకున్నా చేయాల్సిందే. ఏదిఏమైనా ముద్దు సీన్స్‌లో నటించడం చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది' అని అంజలి చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్'లో ముఖ్యపాత్రలో నటిస్తున్నది. తమిళం, మలయాళంలో కొన్ని సినిమాలను ఓకే చేసింది.

కెప్టెన్ మిల్లర్ పోరాటం

ధనుష్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మాతలు. ఈ నెల 12న తమిళనాట విడుదలైన ఈ చిత్రానికి చక్కటి ఆదరణ లభిస్తున్నది. ఈ నెల 25న తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు రిలీజ్ చేస్తున్నాయి. ఈ చిత్ర ట్రైలర్‌ను అగ్ర హీరోలు నాగార్జున, వెంకటేష్ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా విడుదల చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం నడిచే ఈ కథలో ధనుష్‌ను కెప్టెన్ మిల్లర్‌గా పరిచయం చేశారు. తన గ్రామాన్ని దోచుకోవడానికి ప్రయత్నించే వలసవాదులను తరిమికొట్టడానికి కెప్టెన్ మిల్లర్ చేసే పోరాటం ఆకట్టుకుంది. ధనుష్ విభిన్న అవతారాల్లో కనిపించారు. యాక్షన్ ఘట్టాలు రొమాంచితంగా సాగాయి. విజువల్స్ మరో స్థాయిలో కనిపించాయి. యాక్షన్, దేశభక్తి అంశాలతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాణ సంస్థ: సత్యజ్యోతి ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: అరుణ్ మాథేశ్వరన్.

గ్రహాంతరవాసి కాన్సెప్ట్‌తో 'అయలాన్'

రకుల్‌ప్రీత్‌సింగ్, శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ 'అయలాన్'. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్. ఆర్.రవికుమార్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కేజేఆర్ స్టూడియోస్ పతాకంపై తెరకెక్కించగా సంక్రాంతి కానుకగా ఈ నెల 12న తమిళనాడులో విడుదలైంది. 'అయలాన్' అంటే ఏలియన్ (గ్రహాంతరవాసి). గ్రహాంతరవాసి కాన్సెప్ట్‌తో దక్షిణాది భాషల్లో సినిమా రావడం ఇదే ప్రప్రథమం. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న తెలుగులో విడుదల చేయనున్నట్లు గంగ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెలిపింది. 'వరుణ్ డాక్టర్' సినిమా తర్వాత శివ కార్తికేయన్, కేజేఆర్ స్టూడియోస్, గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబోలో చిత్రమిది. కార్తికేయన్ నటన, కామెడీ, సినిమా కాన్సెప్ట్ తమిళ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సైన్స్ ఫిక్షన్ యూనివర్స్ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ సినిమాలో తెలుగు ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయని చిత్ర యూనిట్ తెలిపింది. శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన ఈ సినిమాలో ఇషా కొప్పికర్, 'సర్దార్ గబ్బర్ సింగ్' ఫేమ్ శరద్ కేల్కర్, సీనియర్ హీరోయిన్ భానుప్రియ ఇతర తారాగణం. సినిమాటోగ్రఫీ: నీరవ్ షా; కొరియోగ్రఫీ: గణేష్ ఆచార్య, పరేష్ శిరోద్కర్, సతీష్ కుమార్; నిర్మాత: కోటపాడి జే రాజేష్; దర్శకత్వం: ఆర్.రవికుమార్.

వాఘా సరిహద్దులో వందేమాతరం

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ అడ్వెంచర్ 'ఆపరేషన్ వాలెంటైన్'. ఈ సినిమాలోని 'వందేమాతరం' అనే తొలి గీతాన్ని బుధవారం వాఘా సరిహద్దుల్లో ఆవిష్కరించారు. అక్కడ రిలీజ్ చేసిన మొట్ట మొదటి పాటగా చరిత్ర సృష్టించిందీ గీతం. దేశభక్తి ప్రధానంగా ఈ పాట సాగింది. వైమానిక దళం పెద్ద యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్లు చూపే ఈ పాటను దేశ రక్షణకు పోరాడే ధైర్యవంతులందరికీ నివాళి అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంతో హిందీలో అరంగేట్రం చేస్తున్న వరుణ్ తేజ్ ఈ పాటలో యూనిఫాంలో కనిపించారు. కథానాయిక మానుషి చిల్లార్ యుద్ధంలో ఉన్న తన ప్రియుడు (వరుణ్ తేజ్) గురించి ఆందోళన చెందే రాడార్ ఆఫీసర్‌గా కనిపించింది. రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించగా, మిక్కీ జే మేయర్ సంగీతం సమకూర్చారు. ఈ పాటను తెలుగులో అనురాగ్ కులకర్ణి, హిందీలో సుఖ్వీందర్ సింగ్ పాడారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ పతాకాలపై సందీప్ ముద్దా నిర్మించారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడు. తెలుగు, హిందీలో ఫిబ్రవరి 16న విడుదల కానుంది.

ఆంజనేయుడి భక్తుడిగా నిఖిల్

'హనుమాన్'కు విశేష ప్రేక్షకాదరణ లభించింది. ఇండియన్ సూపర్ మాన్‌గా తెరకెక్కిన ఈ సినిమా సగటు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నది. ఈ నేపథ్యంలో రాబోయే పాన్ ఇండియా సినిమాల్లో ఆంజనేయుడి రిఫరెన్స్ ఉండటం కాకతాళీయమే అనిపిస్తోంది. నిన్న చిరంజీవి 'విశ్వంభర'లో ఏకంగా పెద్ద అంజనీ పుత్రుడి విగ్రహాన్ని చూపించడం ద్వారా కథలో కీలకం కానున్నాడని చెప్పకనే చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి హనుమకు పరమ భక్తుడు అయినందువల్ల హనుమంతుడి సన్నివేశాలకు ప్రాధాన్యం ఉండటమనేది సహజమే. తాజాగా ఈ జాబితాలో మరో సినిమా చేరింది. 'స్వయంభు'లో తాను హనుమంతుడి భక్తుడిగా నటిస్తున్నట్లు ఆ చిత్ర కథానాయకుడు నిఖిల్ స్వయంగా ప్రకటించడం ద్వారా ముఖ్యమైన క్లూ ఇచ్చేశాడు. ఇతిహాసాల నేపథ్యంలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఎపిక్ డ్రామా ఇది. 'స్వయంభు' వచ్చే దసరా లేదా దీపావళికి విడుదలకు ప్రయత్నిస్తున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమాకు సంబంధించి క్యాస్టింగ్‌ను ఇంకా ప్రకటించలేదు. నిఖిల్ హీరోగా రామ్‌చరణ్ నిర్మిస్తున్న 'ది ఇండియా హౌస్' మీద కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఒకేసారి మూడు చిత్రాల ప్రకటన?

బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్‌కు గత ఏడాది బాగా కలిసొచ్చింది. పఠాన్, జవాన్, డంకీ చిత్రాలతో హ్యాట్రిక్ హిట్ కొట్టారు. ఓ అగ్ర హీరో కేవలం ఏడాది వ్యవధిలో మూడు భారీ విజయాలను సొంతం చేసుకోవడం అరుదైన విషమయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సినిమాలకు బ్రేక్ తీసుకొని కుటుంబంతో విరామ సమయాన్ని ఆస్వాదిస్తున్నారు షారుఖ్‌ఖాన్. అయితే ఆయన తదుపరి సినిమాల గురించి ఇప్పటివరకు ఎలాంటి వివరాలు తెలియరాలేదు. దాంతో అభిమానులు కాస్త అసహనంగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం వారిని సంతృప్తిపరిచేలా ఒకేసారి మూడు సినిమాలను అనౌన్స్ చేయడానికి షారుఖ్‌ఖాన్ సిద్ధమవుతున్నారని తెలిసింది. గత కొద్ది రోజులుగా పలువురు దర్శకులు, రచయితలతో వరుస భేటీలు నిర్వహిస్తూ స్క్రిప్ట్‌లను ఓకే చేసే పనిలో ఉన్నారట షారుఖ్‌ఖాన్. మూడు భిన్న జోనర్స్ కథలను ఎంపిక చేసుకోవాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని, ఈ నెలాఖరులో భారీ ప్రకటన ఉంటుందని షారుఖ్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ మూడు చిత్రాల్లో ఒకటి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతున్నదని, మరో చిత్రం మాత్రం 'డంకీ' తరహాలో సందేశంతో కూడిన ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ అని సమాచారం.

సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'

వేదిక, అరవింద్‌కృష్ణ

కథానాయిక వేదిక ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఫియర్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హరిత గోగినేని దర్శకత్వం వహిస్తున్నారు. దత్తాత్రేయ మీడియా పతాకంపై ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్‌కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కరుణాకరన్ క్లాప్‌నిచ్చారు. దర్శకురాలు హరిత గోగినేని చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సస్పెన్స్, థ్రిల్లర్ కథాంశమిది. నీట్‌ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఉత్కంఠను పంచుతుంది. ఏడాది పాటు కష్టపడి ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశాను' అని చెప్పింది. సినిమాలో తన పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని కథానాయిక వేదిక తెలిపింది. జయప్రకాష్, పవిత్రా లోకేష్, అనీష్ కురువిల్ల, షాయాజీ షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఐ.ఆంద్రూ, ఆర్ట్: రాజీవ్ నాయర్, సంగీతం: అనూప్‌రూబెన్స్, సహనిర్మాత: సుజాత రెడ్డి, రచన-దర్శకత్వం: హరిత గోగినేని.